క్లుప్తంగా

శనగ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ

సి.బెళగల్: రబీలో సాగుచేసేందుకు రైతులకు శనగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ పంపిణీ చేశారు. బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, సి.బెళగల్, పోలకల్, ఇనంగడ్ల, కొండాపురం గ్రామాల పరిధిలోని 10 గ్రామ సచివాలయాలకు 280 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు మంజూరయ్యాయి. సోమవారం ఆయా గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు అందజేశారు. క్వింటా రూ.9,400 కాగా 25 శాతం రాయితీపోను రూ.7,050తో పంపిణీ చేస్తున్నామని ఏఓ తెలిపారు. అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

రెండు ఆలయాల్లో చోరీ



శివాలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: గూడూరు మండలం బూడిదపాడు గ్రామంలోని శివాలయం, చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయాల్లోని గంటలు, హారతినిచ్చే పళ్లెంలతో పాటు విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయాన్నే పూజలు చేసేందుకు వచ్చిన పూజారులు దొంగలు పడ్డ విషయాన్ని గుర్తించి గ్రామపెద్దలకు తెలియజేయడంతో వారు కె.నాగలాపురం పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వేలంలో పెరిగిన ఆదాయం



భోగేశ్వరంలో వేలంపాటలు నిర్వహిస్తున్న ఈఓ రామానుజన్

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వక్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో ఆదాయం పెరిగినట్లు ఈఓ రామానుజన్ తెలిపారు. నవంబర్ 11వ తేది నుంచి సంవత్సరం పాటు టెంకాయలు, టీ, మిఠాయిల విక్రయించుకునే దుకాణాలకు రూ.2.43 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది ఈ దుకాణాలకు రూ.2.34 లక్షలు రాగా ఈ ఏడాది రూ.9 వేలు ఆదాయం పెరిగినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు శ్యాంసుందర్ శర్మ, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడి మృతి



జి.మహేష్ (ఫైల్)

మిడుతూరు: ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక తెలుగు పండిట్ మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సహచర ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు.. కోడుమూడూరు మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన జి.మహేష్ (50) మిడుతూరు మండలం వీపనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో హార్ట్ బైపాస్ సర్జరీ నిమిత్తం చేరాడు. సర్జరీ అనంతరం కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మహేష్ మరణవార్త తెలియడంతో పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేవనకొండ మండలం వెంకటాపురం, వీపనగండ్ల ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూళ్లగా ప్రమోషన్ పొందేందుకు అతడు చేసిన కృషిని ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

డ్రిప్ పరికరాల మరమ్మతులపై శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యం (డ్రిప్) పరికరాల్లో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి ఫిట్టర్‌లను నియమిస్తున్నట్లు ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 15 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించే విధంగా ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చిందని, ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూక్ష్మ సేద్య పరికరాల పనితీరు వాటిని అమర్చే విధానంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. అమర్చడంలో లోపాలను గుర్తించి పరిష్కరించాలనే లక్ష్యంతో ఫిట్టర్‌లను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఫిట్టర్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన పదో తరగతి చదివిన (పాస్/ఫెయిల్) యువతకు పత్తికొండ, ఎమ్మిగనూరు, కర్నూలు కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఫిట్టర్లుగా శిక్షణ పొందేందుకు 08518-279724, 79950 10109, 96420 00919 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పైరవీ, పైకం ఉంటేనే బిల్లు!

- పక్కా గృహాల పెండింగ్ బిల్లుల మంజూరులో అవినీతి
- టీడీపీ నాయకుల సంతకాలు ఉంటేనే మ్యాపింగ్ చేస్తానంటున్న వర్క్ ఇన్‌స్పెక్టర్
- ఇంటికి రూ. పది వేలు మామూలివ్వాల్సిందే
- ఇళ్ల మ్యాపింగ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు అన్యాయం



బొల్లవరంలో హౌసింగ్ స్కీం కింద నిర్మించిన ఇల్లు

గడివేముల: మండల వ్యాప్తంగా 2014-2019లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన పక్కా ఇళ్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల మంజూరు ప్రక్రియ తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లుల విడుదలకు ప్రతి ఇంటి వద్ద లబ్ధిదారుల మ్యాపింగ్ చేయాలని ఆదేశించడంతో అధికారులు, తెదేపా నాయకులు కొత్త తరహా అవినీతికి తెర తీశారు. టీడీపీ కార్యకర్తల ఇళ్లను ఎప్పటికప్పుడు మ్యాపింగ్ పూర్తిచేసి, అర్హులైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారు. బిల్లులు కావాలంటే టీడీపీ ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి ప్రసన్నం చేసుకోవాలని, అలాగే ఇంటికి రూ.10 వేల చొప్పున లంచం ఇవ్వాలని అడుగుతున్నారు.

అధికారుల చేయితడపాల్సిందే..

బిల్లుల వ్యవహారంలో కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్న గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఒకరు అన్నీ తానై పనులు చక్కబెడుతున్నారని తెలిసింది. తాము అంత మొత్తం ఇచ్చుకోలేమని పేద ప్రజలు లబోదిబోమంటున్నా.. ప్రభుత్వ మారింది, గత ఐదేళ్ల లాగా పరిస్థితి ఉండబోదంటూ బెదిరించేందుకూ వెనుకాడటం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో పేద ప్రజలు విధిలేక టీడీపీ నాయకుల ఇంటి వద్దకు వెళ్లినా భరించరాని మాటలతో వేధిస్తున్నారు. దీంతో దిక్కుతోచక అధికారులను ఆశ్రయిస్తే న్యాయం చేయాల్సిన వారు లంచం డిమాండు చేసి అధికార పార్టీ నాయకులకే వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదరు అధికారి గతంలోనూ పలు గృహ నిర్మాణ పథకాల లబ్ధిదారులను డబ్బు కోసం పీడించినట్టు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ అవినీతి వ్యవహారం నడుస్తున్నా ఎక్కడ వచ్చే బిల్లు ఆగిపోతుందేమోనని పేదలు మిన్నకుండిపోతున్నారు.

ప్రతి ఇంటికి జియోట్యాగింగ్

2014-2019 సంవత్సరాల్లో మంజూరైన జాబితాలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఎన్‌టీఆర్ వెరిఫికేషన్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇంటి ముందు లబ్ధిదారున్ని నిలబెట్టి జీపీఎస్‌లో ల్యాంగిట్యూడ్, ల్యాటిట్యూట్ తీయాల్సి ఉంది. అలాగే బ్యాంకు పాస్‌బుక్‌ను అప్‌లోడ్ చేయాలి. ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామానికి సంబంధించిన అర్హుల జాబితా వస్తుంది.

కలెక్టరమ్మా.. మీరే దిక్కు !



నాకు 2016-2017 రూరల్ హౌసింగ్ స్కీము కింద ఇల్లు నిర్మించుకునేందుకు (బెనిఫిసరీ ఐడీ:132573211ఎస్‌పీ715811) మంజూరైంది. మా సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాను. దీనికి సంబంధించిన పెడింగ్ బిల్లులు అకౌంట్లో పడతాయని తెలిసింది. దీనిపై వర్క్ ఇన్‌స్పెక్టర్ సలీంబాషా మా ఇంటి వద్దకు వచ్చి మీ పేరు జాబితాలో వచ్చింది, డబ్బులు పడాలంటే టీడీపీ నాయకుల సంతకాలు తీసుకుని, నాకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండు చేశాడు. ఇప్పటికే అప్పు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నా. నేను అంత మొత్తం ఇచ్చుకోలేనని చెప్పినా కనికరం చూపడం లేదు. ఇక మాకు కలెక్టరమ్మే దిక్కు. మేడం వద్దే మా గోడు వెళ్లబోసుకుంటాం.

-యేలంపల్లె రామలక్ష్మమ్మ, బొల్లవరం, గడివేముల

నేడు పోలకల్‌లో పొలం పిలుస్తోంది

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తెలిపారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేస్తామన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ

కల్లూరు : కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన పంపిణీ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, కర్నూలు డివిజన్ వ్యవసాయ సంచాలకులు సాలురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎ.వెంకటస్వామి పాల్గొన్నారు.

టెట్‌కు 26 మంది గైర్హాజరు

పాణ్యం: టెట్ పరీక్షకు 26 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ-2, పరీక్ష పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం పాణ్యం మండలం నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 160 మంది గాను 139 మంది హాజరుకాగా 21 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్న పరీక్షకు 61 మందికి గాను 56 మంది హాజరు కాగా ఐదుగురు హాజరు కాలేదని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల నిరసన



కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న వలంటీర్లు

కోడుమూరు రూరల్: సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10వేల వేతనం ఇవ్వాలని వలంటీర్లు సోమవారం కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని వాపోయారు. ఉద్యోగ భద్రత, రూ.10వేల వేతనం అని చెప్పి తమను ఎటూ తేల్చకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీలు చదివినా జాబ్‌లు రాక జగనన్న ఇచ్చిన వలంటీర్ జాబ్ చేసుకుంటూ ఇన్నాళ్లు నెట్టుకొస్తున్నామని తెలిపారు. నాలుగు నెలలుగా ప్రభుత్వం జీతాలు కూడా ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీ జరిగే మంత్రివర్గ సమావేశంలో వలంటీర్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ రాముడుకు అందజేశారు. వలంటీర్లు కుమార్, జాకీర్‌హుసేన్, రంగస్వామి, ఖాజామోహిద్దీన్, చెన్నప్ప, గంగాధర్, గిరి, హిమబిందు, లలిత, రోజా, అరుణ, లావణ్య, రామానాయుడు, శివ, శ్రీను, రాఘవేంద్ర, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు గ్రామంలో విద్యుదాఘాతంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామంలోని బంగ్లా ప్రాంతంలో నివాసముంటున్న కురువ జయరాముడు(55) తన ఇంటి వద్ద మంచినీళ్ల మోటార్ వేయడం కోసం స్విచ్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గత కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు పిల్లలు అనాథలు కావడంతో స్థానికులు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని అంత్యక్రియల నిమిత్తం, రూ.5000లను ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మృతుని కుటుంబానికి అండగా వుంటామని భరోసానిచ్చారు.

ఉపయోగంలోకి చెత్తబుట్టలు



సర్పంచ్‌లకు డబ్బాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

సాక్షి ఎఫెక్ట్

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓ గదిలో నిరుపయోగంగా ఉన్న చెత్త బుట్టలను ఉపయోగంలోకి తెచ్చినట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్త తెలిపారు. ఈ నెల 5వ తేదీన సాక్షి పత్రికలో ప్రచురితమైన 'నిరుపయోగం!' అనే కథనానికి ఎంపీడీఓ స్పందించారు. కొన్ని రోజుల కిందట మండలానికి మంజూరైన 19,455 చెత్త బుట్టలను సోమవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తబుట్టలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త రెండు బుట్టలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాలునాయక్, గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, ఏఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ భాస్కర్, స్వచ్ఛ ఆంధ్ర కో ఆర్డినేటర్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు: పత్తి పంటలో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా సోమవారం నంద్యాల ప్రాంతీయ పరిశోధనా స్థానం, కర్నూలు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని హుసేనాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తిని పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. కర్నూలు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ పత్తిలో అధిక దిగుబడులతో పాటు, పత్తి నాణ్యతను పెంచడంపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌విష్ణువర్ధన్, డాక్టర్ రవిప్రకాష్ మాట్లాడుతూ.. రానున్న కాలంలో అధిక సాంద్రతతో పత్తి నాటు పద్ధతి ప్రాముఖ్యతను వివరించారు. అలాగే డాక్టర్ చైతన్య కుమారి, టెక్నికల్ ఏఓ దస్తగిరిరెడ్డి పత్తిలో వచ్చే వివిధ రకాల తెగుళ్లు, పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమాదేవి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి, శశిధర్‌రెడ్డి, ఏఓ సుధాకర్, ఏఈఓలు మధు, భాస్కర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.





జనావాసాల మధ్య తక్కువ ఎత్తులో రక్షణ గోడ లేకుండా.., పిచ్చిమొక్కల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

● పొంచి ఉన్న ప్రమాదం



దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు గ్రామస్తులను బయపెడుతున్నాయి. తక్కువ ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్లతో పాటు దిగువపాడు రోడ్డు, ఎద్దుల ఆర్చి సమీపంలోని సుంకరకట్ట సర్కిల్‌లో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రక్షణ గోడ లేకపోవడం, అందే ఎత్తులో ఉండడం, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఇవి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రక్షణ గోడలు లేదా ఎత్తు పెంచి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-కర్నూలు(రూరల్)

అన్నపూర్ణ దేవిగా వాసవీమాత



అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు

గడివేముల: మండలకేంద్రంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఐదవ రోజు సోమవారం అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వసంతలక్ష్మి, సత్యనారాయణ శర్మ అన్నపూర్ణాదేవికి కుంకుమార్చన, శివాభిషేకం, మహా మంగళహారతి తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన్ గుప్తా, ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, మల్లికార్జున, కార్యదర్శి సీవీ రమణయ్య, ఉప కార్యదర్శి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం : మండల కేంద్రంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో, హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను శ్రీలలితాదేవిగా అలంకరించారు. శ్రీకన్యాకపరమేశ్వరి ఆలయంలో వెలసిన అమ్మవారు కూడా శ్రీలలితాదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. ఐదవ రోజు కొత్తూరులో మహాచండీయాగం ఘనంగా జరిగింది.



పాణ్యం శ్రీకాన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీలలితాదేవిగా అమ్మవారు



కోడుమూరు: మహాచండీదేవిగా వల్లెలాంబ



కోడుమూరు: మహాలక్ష్మీగా అంబాభవాని



కె.నాగలాపురంలో మహాచండిగా సుంకులా పరమేశ్వరి



సి.బెళగల్: మహాచండీగా కన్యకాపరమేశ్వరి

జగన్మాతా.. నమోస్తుతే



కోడుమూరులో వల్లెలాంబదేవికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు



కోడుమూరు: అంబాభవాని ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కోడుమూరు రూరల్: మండల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం కోడుమురులోని కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరీదేవి, కాళికామాత, రాములమ్మ, తులజా భవాని, అంబా భవాని, వల్లెలాంబదేవి ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మి, అన్నపూర్ణేశ్వరి, మహాచండి, బాలాత్రిపుర సుందరిగా పూజలందుకున్నారు. మాతా అంబా భవాని ఆలయంలో 300 మహిళలతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన చేశారు. అలాగే వల్లెలాంబదేవి ఆలయంలో అమ్మవారు మహాచండిగా దర్శనమిచ్చారు. రాత్రి అమ్మవారి పల్లకీ సేవ కనుల పండుగా జరిగింది. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరులో..

మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గూడూరులోని మాతా అంబాభవాని ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా, కె.నాగలాపురం గ్రామంలో సుంకులాపరమేశ్వరి మహాచండి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాచండీగా అమ్మవారు

సి.బెళగల్: మండలంలోని శివాలయంలో అమ్మవారు మహాచండీదేవిగా పూజలందుకున్నారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అలాగే సి.బెళగల్ పాత బస్టాండ్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరికి ఆర్యవైశ్యులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు మహాచండీ దేవిగా అభయమిచ్చారు. సాయంత్రం పల్లకీ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

గందరగోళానికి ముగింపు

● ఎట్టకేలకు విధుల్లో చేరిన ఉద్యోగులు



ఎంపీడీఓ కార్యాలయంలో రిలీవింగ్, జాయినింగ్ రిపోర్టులు అందజేస్తున్న ఉద్యోగులు

సి.బెళగల్: మండలంలో అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో చోటు చేసుకున్న గందరగోళానికి సోమవారం ముగింపు పలికింది. బదిలీల్లో భాగంగా మండలం నుంచి వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సంక్షేమ, ఇంజినీరింగ్, సర్వే సహాయకులు తదితరులు ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. అదేవిధంగా ఆయా స్థానాలకు ఇతర మండలాల నుంచి అధికారులు, సచివాలయాల ఉద్యోగులు సి.బెళగల్ మండలానికి నియామకం అయ్యారు. దీంతో మండలానికి కేటాయించిన ఉద్యోగులు, అదేవిధంగా ఇక్కడ నుంచి వేరే మండలాలకు బదిలీ అయిన వారు విధుల నుంచి రిలీవ్ అయ్యేందుకు శుక్ర, శనివారాల్లో మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మండల అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో మండలానికి వచ్చిన అధికారులు, ఉద్యోగులను చేర్చుకోకపోవడంతో మూడు రోజుల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. అధికారపక్ష నాయకుల ప్రయత్నాలు సాగకపోవడంతో ఎట్టకేలకు ఈ గందరగోళానికి ఫుల్‌స్టాప్ పడింది. సోమవారం మండల పరిషత్ కార్యాలయ అధికారులు బదిలీపై వచ్చిన వారిని విధుల్లోకి చేర్చుకోవడంతో పాటు, ఇతర మండలాలకు బదిలీ అయిన వారిని రిలీవ్ చేశారు. మొత్తానికి 19 మంది విధుల్లో చేరగా..ఏడుగురు ఉద్యోగులను మండలం నుంచి రిలీవ్ చేశారు.

సమస్యలపై వినతి



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులను కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మారందొడ్డికి చెందిన పాండు, సి.బెళగల్‌కు చెందిన కృష్ణమూర్తి, ఆయా గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ రామన్న, ఏపీఎం రామేశ్వర్ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాగా పలువురు అధికారులు డుమ్మా కొట్టారు.